# సరస్వతీ లిపి

- ఆకెళ్ళ శివప్రసాద్

అనిర్వచనీయమైన అనుభూతిలో మునిగిపోయాం మేమంతా. ఏ మాత్రం అర్థం కాని భాష... అంతరంగ అంతఃపురంలో రసస్పందన... కంఠంలో శ్రావ్యత... మాటలోని సౌందర్యం... మంత్ర ముగ్ధులయిపోయాము. మాటలు రాని మూగవాళ్ళలా కాసేపు వుండిపోయాము. ఆ పైన... నా వెనుక నుండి ఎవరో అభినందిస్తున్నట్టుగా చప్పట్లు కొట్టారు. ఆ చప్పట్ల పరంపర ఆ ప్రాంగణమంతా మారుమ్రోగిపోయింది.

అతను పాడిన పాటల్లోని మాటల కర్థమేమిటని ఎవరూ అడగలేదు. అడగరు కూడా... జవం జీవం ఆ భాషలో ఉట్టి పడుతున్నాయ్. తెలీని భాషలో తెలపాలనుకున్న భావాన్ని వ్యక్తం చేయగలిగాడు అతను. అందరికీ ఏర్పాటు చేసినట్టే, అనువాదకుడిని ఏర్పాటు చేసారు. ఆ అనువాదకుడు- తనకి అనువాదకుడు అవసరంలేదని ఆ వ్యక్తి చెప్పిన విషయాన్ని తెలియజేస్తూ కూచున్నాడు.



అక్కడ వున్నవారెవరికీ గ్రీకు భాష తెలియదు. ఆ భాష ఔన్నత్యం వేరే భాషలో అందించడం అతనికి యిష్టం లేదు.

ఒకే ఒక వాక్యం ఇంగ్లీషులో చెప్పాడు. గ్రీకు దేశంలో, గ్రామాల్లో పాడుకునే జానపద గీతమని మాత్రం తెలియజేసాడు. 'జన హృదయం' ఆ జానపద గీతంలో వొదిగి వుండి వుంటుంది. అందుకే గుండెకి సూటిగా తాకింది ఆ గీతం.

ఆ పాట పాడడం మొదలుపెట్టిన క్షణంలో అతని కళ్ళలో ముత్యాల్లా కన్నీళ్ళు.

ఆ కన్నీళ్ళు కొత్త భాషకి పురుడు పోస్తున్నట్టు అనిపించింది. పాడుతున్నంతసేపు తనని తాను మరచిపోయాడు. అతనే కాదు, ఆ చుట్టు పక్కలవాళ్ళు, తన్మయత్వంతో కొత్త లోకాల్లోకి విహరించారు. 'నా భాషలో గొప్పతనముంటే అదే మీ అందరిని రంజింప చేస్తుంది' అన్న ధీమా వుంది అతని చూపులో.

శబ్దంలోని స్వరం గమకాలు తొక్కింది. ఒక్కోసారి గొప్ప వాటికి అర్థం తెలుసుకోవడంలో కన్నా, నిరంతరం వూహించుకోవడంలో ఆనందం వుంటుంది.

చాలామంది లాగానే నేనూ, వేదిక దగ్గరకి చేరాను. అభినందనల పర్వం పూర్తయ్యింది. అందరికి వినయంగా రెండుచేతులతోనూ నమస్కరిస్తున్నాడు అతను. అణకువ, విధేయత జ్ఞానులకి అలంకారాలుగా నిలుస్తాయి.

సాధారణ ప్రచురణ (రూ. 1,000)కు ఎంపికయిన కథ

కథ





# తెరపై సానియా మీర్జా!

తెరపై సానియా మీర్జా అనగానే సానియా హీరోయిన్ అయిపోతోందని అనుకుంటే మీరు పొరబడినట్లే. అసలు సంగతి ఇది. టెన్నిస్‌లో సంచలనాలను సృష్టించిన సానియా మీర్జా కెరీర్‌ని బాలీవుడ్‌లో తెరమీదికెక్కించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంబ్రెల్లా ఫిలిమ్స్ అధినేత దీపక్ ఆర్ గాంధీ ఈ చిత్రానికి నిర్మాత. గతంలో 'కుచ్ ఖేల్ కుచ్ మస్తీ' అనే కామెడీ సినిమా తీశారు. దర్శకులు హేమంత్ దాస్ ఈ స్క్రిప్ట్ గురించి చర్చించారు. ఈ చిత్రం సానియా మీర్జా జీవితమే అయినా వైవిధ్యంగా, మార్గదర్శకంగా ఉంటుంది. ప్రతి ఒక్కరు కలలు కంటారు జీవితంలో మంచి పొజిషన్‌లో వుండాలని! కాని కొందరు మాత్రమే అడ్డంకులను అధిగమించి గమ్యానికి చేరువవుతారని అన్నారు. సానియా నిజ జీవితానికి, సినిమాలో చూపించేదానికి ఏమైనా పోలికలుంటాయా? అని అడిగితే, సానియా జీవితంలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాలు మాత్రమే తీసుకుంటున్నాము. అవి మార్గదర్శకంగా వుంటాయి. కొంత కల్పన కూడా వుంటుంది. సానియా పాత్రకు ఇషాడియోల్‌ను తీసుకునే ఆలోచనలో వున్నామన్నారు.



నాకు మాటలు రాక, శిలా ప్రతిమలా వుండి, అతన్ని కళ్ళతోనే పలకరించి, అతని చేతిని నా చేతిలోకి తీసుకుని ఆనందపడ్తున్నాను.

అప్పుడే త్రివిక్రమ్ అటుగా వొచ్చాడు. నా 'బాధ'ని అర్థం చేసుకున్నట్టు – 'వీరిపేరు మార్కోస్. ఏథెన్స్ నుండి వొచ్చారు.' అని పరిచయం చేసాడు. మార్కోస్‌కి నా పేరు వివరాలు చెప్పాను. అంతరించిపోతున్న భాషా సంస్కృతుల మీద త్రివిక్రమ్ ముంబయిలో ఓ సదస్సు ఏర్పాటు చేసాడు. వీలుంటే నన్నూ రమ్మన్నాడు.

ఇలాంటి సదస్సుల్లో మేధావులు తీర్మానాలు చేస్తారు. ఆ రెండురోజులు హడావిడిగా సాగిపోతుంది. ఆ తరువాత ఎవరి గోల వారిదేలా వుంటుంది. అంచేత, ముందుగా రావాలని అనుకోలేదు. అనుకోకుండా వచ్చాను. రెండు రోజుల కార్యక్రమం 'అలవాటు' ప్రకారం హాజరయిన కార్యక్రమం లాగే వుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారి ఉపన్యాసంతో సహా అన్నీ షరా మామూలే పద్ధతిలో నడిచాయి.

ఇవాళ, యింత క్రితం మార్కోస్ పాడిన పాటే విశేషమని చెప్పొచ్చు. త్రివిక్రమ్ మిగిలిన తంతు నిర్వహిస్తుండగా, మార్కోస్‌తోపాటు నేను బైటకి వచ్చాను. అదీ త్రివిక్రమ్ చలవే.

మార్కోస్ ముంబయికి అదే మొదటిసారి రావడం. నగరం చూడాలని వుందన్నాడు. టూరిస్ట్ ప్రాంతాలు వద్దని చెప్పాడు. ''ప్రజల్లో కలసి కొన్ని గంటలు తిరుగుదాము'' అన్నాడు. అలాగే తిరిగాము.

నేను ఇంగ్లీషులో మాట్లాడుతుంటే, మీ మాతృభాష ఇదేనా? అని అడిగాడు. తెలుగని చెప్పాను.

''మీరు తెలుగులో మాట్లాడండి. నేను గ్రీక్‌లో మాట్లాడతాను,'' అన్నాడు. చిత్రమైన కోరికలా అన్పించింది. కానీ తెలీని అనుబంధం ఏర్పడింది అలా మాట్లాడుకోవడం వల్ల.

నాకు గ్రీకులో 'ఎథోస్' అన్నమాట తప్ప వేరే ఏమీ అర్థం కాలేదు. అతనికి 'పచ్చ గడ్డి పువ్వు', 'రెల్లుపూల వాన', 'సౌందర్యం', వగైరా మాటలు నచ్చాయి.

అప్పుడే నాకో పెద్ద పరీక్ష పెట్టినట్టు అన్పించింది. నేను పొరబాటున ఇంగ్లీషు మాట వుపయోగిస్తే నా కన్నా ఎక్కువ ఇబ్బంది పడిపోతున్నాడు మార్కోస్. అంచేత శాయశక్తులా తెలుగులో మాట్లాడే ప్రయత్నం చేసాడు.

తెలీని మనిషితో, తెలీని భాషవింటూ, తెలుసున్న భాష మాట్లాడ్డం అదృష్టమే అనిపిస్తుంది.

ఓ పూట అలాగే గడిపాను. ఒకరి ఈ-మెయిల్ ఎడ్రస్ మరొకరు తీసుకున్నాము. ఆ సాయంత్రం మార్కోస్‌కి వీడ్కోలు చెప్పే బాధ్యత నాకు అప్పగించాడు త్రివిక్రమ్.

ఎయిర్‌పోర్ట్‌లో ఆత్మీయుడిని దూరం చేసుకుంటున్న వేదనతో మార్కోస్‌కి వీడ్కోలు చెప్తుంటే –

చెక్‌కి వెళ్ళబోతూ –

వెనక్కి వచ్చి –

''సరస్వతి లిపి గురించి తెలుసుకోవాలని వుంది... మీకు తెలుసా?'' అని అడిగాడు.

ఎక్కడో, ఎప్పుడో విన్నాను 'సరస్వతి లిపి' అనే మాట.

తెలుసు అన్నట్టుగా తలూపాను, తెలుసుకుంటాను అన్నట్టుగా తలూపాను.

గమనించలేదు!

* * *

'సరస్వతి లిపి' గురించి ఎక్కడ విన్నానో గుర్తు తెచ్చుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాను.

'ఎక్కడా?' గట్టిగానే అరిచినట్టున్నాను, నా పక్కనే వున్న తమిళ ప్రయాణికుడు కాస్త విసుగ్గా చూసాడు.

మరో గంటలో విమానం హైద్రాబాద్ చేరుతుంది.

ఎంగేజ్‌మెంట్ డైరీలో కార్యక్రమాలు చాలా వున్నాయ్. వాటి మధ్య పెద్దగా 'సరస్వతి లిపి' అని రాసుకున్నాను.

'సరస్వతి లిపి' గురించి ఎవరో చెప్పారు. ఎవరు, ఏ సందర్భంలో చెప్పారు?

ఒడ్డుకి చేరి వెనక్కి వెనక్కి వెళ్ళి పోతున్న అలలా జ్ఞాపకం మనసుని తాకి వెనక్కి వెళ్తోంది.

ఆలోచనల్తో హైద్రాబాద్ చేరుకున్నాను.

యింటికి చేరి యాంత్రిక జీవనంలో పడిపోయాను ఓ రెండు రోజులు.

ఆ రోజు మెయిల్ చూస్తుంటే –

'మార్కోస్‌నుండి మెయిల్ వచ్చింది. చక్కటి ఇంగ్లీషులో –

'మనుష్యులు, లిపులు ఆదరణ కోరుకుంటాయ్. వున్నప్పుడు వాటి విలువ తెలుసుకోలేకపోతే... ఎప్పటికీ అందవు. మనం కోల్పోయాకా విలువ తెలిసినా నిరుపయోగం. కేవలం మనుష్యుల్ని, లిపుల్నే మనం పోగొట్టుకోము; చరిత్రని, సంస్కృతిని, అమూల్యమైన జీవన శోధనని పోగొట్టుకుంటాము. సరస్వతి లిపి గురించి నేను అడిగింది గుర్తు వుందిగా.' – అని వుంది.

అప్పటివరకు జ్ఞాపకం వచ్చినప్పుడు సరస్వతి లిపి గురించి ఆలోచించానే తప్ప, జ్ఞాపక ముంచుకుని నిబద్ధతతో ప్రయత్నించలేదు.

మార్కోస్ మెయిల్ విస్మరించిన కార్యాన్ని గుర్తు చేసింది. ఎలాగైనా ఆ వివరాలు తెలుసుకోవాలని నిర్ణయం తీసుకున్నాను.

పాత డైరీలు, ఉత్తరాలు వెతకడం ప్రారంభించాను. ఖచ్చితంగా విన్నానని గుర్తుంది. నాలుగేళ్ళ క్రితం రాసిన డైరీలో బస్సు టిక్కెట్ ఒకటి కనిపించింది. ఆ టిక్కెట్టుని తిప్పి చూస్తే వెనక పక్క ఏవో అక్షరాలు అస్పష్టంగా కనిపించాయి. టిక్కెట్టుని చేతిలో పెట్టుకొని చూసాను. ఏలూరు టిక్కెట్టది. ఏలూరు వెళ్ళిన జ్ఞాపకం మనసు లోతుల్లో కదిలింది. డైరీలో 'ఏలూరులో పేరయ్య కోనేరు దగ్గర' అనే చిరునామా రాసుకున్నాను. ఏలూరులో నాకున్న ఏకైక మిత్రుడు దీక్షితులు. దీక్షితులు గుర్తురాగానే అక్కడే వున్న సరస్వతి దేవి గుడి ప్రాంగణంలో ఈ సరస్వతి లిపికి సంబంధించిన ప్రస్తావన గుర్తు వచ్చింది. ఆ వెంటనే...

మాసిన గడ్డం... నుదుటున విబూది రేఖలు... బక్క పల్చటి ఆకారం... అస్పష్టంగా కళ్ళముందు కదిలింది. రామకృష్ణ పరమహంసలా వున్నట్టు

అనిపించింది ఆయన్ని చూస్తే. పోలిక గుర్తుంది కాని మనిషి పేరు గుర్తు రాలేదు. ఆలస్యం చేయకుండా దీక్షితులకి ఫోన్ చేసాను.

''ఆ రోజు మనం కలుసుకున్న ఆయన పేరేంటి? వూరేంటి?'' అనడిగాను.

''ఎవర్రా? ఏమిటి విషయం?'' మధ్యలో విషయం మొదలు పెట్టేసరికి, కాస్త విసుగ్గా, అర్థం కానట్టుగా అడిగాడు దీక్షితులు.

క్లుప్తంగా వివరాలు చెప్పాను.

''ఆ రోజు చాలామందిని కలిశాంరా...''

''సరస్వతి గుడి నుండి బైటకి వొస్తుంటే ఆయన కన్పించారని వెనక్కి వెళ్ళాము,'' మరికొంత వివరంగా చెప్పాను.

''ఎవర్రా?'' ఆలోచనలో పడి –

''అయినా ఎవరన్నది తెలుసుకోవలసిన అవసరం ఏమొచ్చింది? హాయిగా పడుకోరా... రేపు ఆలోచించి, గుర్తుకు వస్తే చెప్తాను... గుడ్‌నైట్,'' అని ఫోన్ పెట్టేసాడు. నా సంగతి బాగా తెలుసు కనుక, వెంటబడే అవకాశం లేకుండా ఫోన్ ఆఫ్ చేసేసుకున్నాడు.

రాత్రికి రాత్రి తెలుసుకోవాలన్న ఆలోచన క్షణం అవివేకంగా అనిపించినా, మనసు కుదుట పడక, ఆయన గురించి ఆలోచిస్తూ వుండిపోయాను. వంట్లో ఉక్కపోస్తున్నట్టుగా అన్పించి, బాల్కనీలోకి నడిచాను. నక్షత్రాల లిపిలో చంద్రుడు ఆకాశమ్మీద అపరిచితమైన భాషతో క్రీడిస్తున్నట్టు కనిపించాడు. కాస్త ఉపశమనంగా పిల్లగాలి.

దారి తప్పిన పిల్లవాడు తల్లిని వెతుక్కుంటూ బయలుదేరినట్టు ఆ రాత్రే ఏలూరు బయలుదేరాలని నిర్ణయం తీసుకుని, అమలు చేసే ప్రయత్నంలో, మరో పది నిముషాల్లో బస్సు డిపోకి బయలుదేరాను.

* * *

''నువ్వే'' ఆశ్చర్యంగా చూసాడు దీక్షితులు. రాత్రి ఫోన్‌లో మాట్లాడిన మనిషి, ఉదయమే వస్తాడని ఊహించినట్టులేదు.

''సరస్వతి లిపి గురించి తెలుసున్న మనిషి మనకి తెలుసురా,'' అన్నాను.

దీక్షితులు నా అంతర్యం గ్రహించి, ఆలోచనలో పడ్డాడు.

యిద్దరం దగ్గర్లోవున్న శివాలయంలో వున్న సరస్వతీ దేవి ప్రాంగణంలో కూచున్నాము.

''ఆయన పేరు...'' గుర్తు తెచ్చుకునే ప్రయత్నంలో అన్నాడు.

''రామకృష్ణ పరమహంసలా వుంటారు చూడ్డానికి.... ఏదో ఋషి పేరు,'' అన్నాను.

''...లీలాధర శాస్త్రి, ఆంజనేయ శర్మ, పరబ్రహ్మ చయనులు, భాస్కరం ఘనాపాఠి, శివానందమూర్తి...'' తనకి తెలుసున్న పండితుల పేర్లు చెప్పడం మొదలుపెట్టాడు.

''ప... ప... పతంజలిగారు,'' ఠక్కున గుర్తుకువచ్చింది, ''ఇదే ప్రాంగణం... ఇక్కడే...'' సరస్వతీదేవి కుడి వైపు చోటుని చూపిస్తూ అన్నాను.

''నేను చాలా రోజులయిందిరా కలసి''

## రచయిత పరిచయం



**వృత్తి:** దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం. **ప్రవృత్తి:** కథలు, నవలలు రాయడం. 125 కథలు వివిధ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. 3 చిన్న నవలలు, ఓ సీరియల్ ప్రచురణకు నోచుకుంది. ఆరుకథలకి వివిధ పత్రికలలో బహుమతులు అందుకున్నాను. 1986లో 'నది' చిన్న నవలకి భారతి మాసపత్రికలో బహుమతి లభించింది. 1996లో రేడియో నాటిక 'సృజన'కి జాతీయ పురస్కారం. 1997లో 'నరవాహనం' రంగస్థల నాటకానికి జి.ప్రభాకర్‌రెడ్డి స్మారక పురస్కారం. ఉత్తమ రచయితగా ప్రశంసలు. వివిధ నాటక పరిషత్తులలో ఈ నాటకానికి బహుమతులు. 2003 నంది నాటకాలలో 'సూది-దారం' నాటికకి రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం. 'సరస్వతి లిపి' కథని సాధారణ ప్రచురణకి ఎంపిక చేసిన సి.పి.బ్రౌన్ అకాడమీ-నవ్య వీక్లీకి ధన్యవాదాలు.

**– ఆకెళ్ల శివప్రసాద్**

''ఏ వూర్లో వుంటారు?''

''కోనసీమలో.... అంబాజీపేట నుండి వెళ్ళాలి. నరేంద్రపురం''

''పద వెళ్దాం,'' తక్షణమే బయలుదేరడానికి ఏర్పాట్లు చేసుకున్నాం.

* * *

సిద్ధాంతం బ్రిడ్జి మీద నుండి గోదావరి ఇసుక తిన్నెలని చూస్తూ – ''పతంజలిగారే చెప్పారా... ఆ సరస్వతి లిపి గురించి?'' కాస్త అనుమానంగా అడిగాడు.

''ఆఁ... ఆయనే చెప్పారు. మనదేశంలో అతి కొద్దిమందికే ఆ లిపి తెలుసట. మహానగరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటానుగా... ఆ లిపిని పరిరక్షించుకుని, ప్రచారంలోకి తేవాలి అన్నారు. చాలా విషయాలు చెప్పారు. ఏమీ గుర్తులేవు. గుర్తుంచుకోవాలనే ప్రయత్నం చేయలేదు. సాంస్కృతిక కార్యక్రమాల్ని కర్మకాండల్లా నిర్వహించే దౌర్భాగ్య స్థితిలో పడిపోయాము. గ్రాంట్‌ల కోసం రాజకీయనాయకులని, జన సమీకరణ కోసం సినీతారలని పోగేయడంలోనే శక్తియుక్తులు ధారపోస్తున్నాము. ఇలాంటి లిపి గురించి తెలుసుకోవాలని, తెలియచెప్పాలని ఎప్పుడూ ప్రయత్నించలేదు,'' నిజాయితీగా చెప్పాను. నాకు తెలియకుండా ప్రాయశ్చితంగా కన్నీళ్ళు బుగ్గల మీద నుండి జారి గుండెల మీద పడ్డాయి.

గంటన్నర తరువాత –

నరేంద్రపురం పెద్ద చెరువు వున్న రోడ్డు దగ్గర కారు ఆపి, దీక్షితులు అటుగా వెళ్తున్న ఒకరిని, ''పతంజలిగారి యింటికి ఎటు వెళ్ళాలి?'' అని అడిగాడు.

''అమ్మవారి గుడి పక్కనుండి వెళ్ళి అడిగితే ఎవరైనా చెప్తారు,'' అన్నాడతను.

మరో ఐదు నిముషాలలో పతంజలిగారి యింటి ముందుకు చేరాము.

పాతకాలం నాటి పెంకుటిల్లు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

కారు శబ్దానికి బైటకి వచ్చిన పండు ముత్తయిదువుని దీక్షితులు పతంజలిగారి గురించి అడిగాడు. ఆవిడకు వినికిడి దోషం ఉన్నట్టుంది. దీక్షితులు కంఠం చించుకుని అరిచాడు. ఆవిడ కొంగుని తలమీదకి తీసుకుని, చేత్తో లోపలికి రమ్మని సైగ చేసింది. కారువాడికి డబ్బులు ఇచ్చి పంపించి, ఇద్దరం లోపలికి నడిచాము.

ఓ పక్కగా వుంది ఆ గది. ఆ గదిలో నులకమంచమ్మీద, గూటిలో ఒదిగి పోయిన గువ్వలా కన్పించారాయన.

ప్రశాంతంగా నిద్రలో వున్నారు. ఆయన్ని చూసిన వెంటనే గుర్తుకు వచ్చింది రెచ్చిపోయి నేను చేసిన వాగ్దానాల పర్వం. సిగ్గుతో, నిద్రపోతున్నా ఆయన ముఖం వైపు చూడలేకపోయాను.

పతంజలిగారి భార్య కాబోలు పండు ముత్తయిదువ, రెండు గ్లాసుల నిండా మజ్జిగ, నాలుగు అరటి పళ్ళు అక్కడే వున్న ముక్కాలి పీట మీద పెట్టింది.

''చాలా మంది వేదాలు చదువుకుంటారు. పతంజలిగారికి ఆ వేదాల అర్థం తెలుసు. చాలా వివరంగా చెప్పేవారు...'' మరొక విషయం చెప్తున్నట్టుగా చెప్పాడు దీక్షితులు.

జీవితానికో సార్థకత తెచ్చుకున్న మహనీయుడిలా కన్పించారు. కానీ, ఆయన ప్రతిభ, విద్వత్తు, మేధస్సు ఎంతమందికి తెలుసు. నాకు తెలిసినా నేను ఏం చేయగలిగాను. సరిగ్గా పట్టించుకోలేదు. తప్పుచేసినవాడిలా కూచున్నాను.

కాసేపు నిశ్శబ్దం. ఆ తరువాత ఆవిడ గొంతు వినిపిస్తోంది. పక్కింటి వాళ్ళకి పెరట్లోంచే మా గురించి చెప్తున్నట్టుంది. తన భర్త గురించే వచ్చారని ఆనందంగా చెప్తోంది.

మజ్జిగ తాగి, అరటి పళ్ళు తిన్నాము.

ఈ మనిషిలో ఎన్ని వేదాలు నిక్షిప్త మయ్యాయో, ఎన్ని లిపిలు ఒదిగి పోయాయో, ఎన్ని అనుభవాలు, అనుభూతులు, భావాలు



## వాటర్ టిప్స్

★ మండు వేసవిలో మంచి నీరే మంచి ఔషధం.

★ నీళ్ళు ఎక్కువ తాగేవారే ఆరోగ్యవంతులు. ఒక మి.లీ. వాటర్, ఒక కేలరీతో సమానం. యు. ఎస్. నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్ వారు ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

★ వేడి వాతావరణాన్ని తట్టుకోవడానికి వీలైనంత ఎక్కువగా నీళ్ళు తాగాలి.

★ రాత్రి పడుకునే ముందు నీళ్ళు తాగకూడదు. అయితే పడుకునే సమయానికన్నా రెండు గంటలకు ముందే నీటిని తాగితే మంచిదని కౌన్సిల్ పేర్కొంది.

★ శీతల పానీయాలు, చల్లని నీరు అతిగా సేవించటం వల్ల శరీరంలో బలం తగ్గిపోతుంది. అందుకని గోరు వెచ్చని నీటిని లేదా గది ఉష్ణోగ్రతలో వుంచిన నీటిని తాగితే మరి మంచిదీ!

★ ఉదయం లేవగానే పరగడుపున ఒక అరలీటర్ (తాగగలిగితే ఒక లీటర్) బ్రెష్షింగ్‌కి ముందే తాగితే కాలకృత్యాలు సాఫీగా సాగుతాయి.

★ భోజనానికి అరగంట ముందు ఎక్కువ నీళ్ళు తాగకుండా, భోజనం అయిన అరగంట తర్వాత నీటిని తాగితే జీర్ణక్రియ బాగా జరుగుతుంది.

గూడుకట్టుకున్నాయో?

సముద్రంలో రత్నాలు, పగడాలు, వజ్ర వైఢూర్యాలు మునిగి పోయినట్టుగా వుంది ఆయన్ని చూస్తుంటే!

ఈ మనిషితో మనసు విప్పి మాట్లాడాలి... ముందుగా క్షమాపణలు చెప్పుకోవాలి... ఆ పైన, కొన్ని రోజులయినా, నెలలయినా యిక్కడవుండి, ఈయన సేవ చేసుకుని, అపురూపంగా దాగున్న జ్ఞాన భాండాగారాన్ని వెలికి తీయాలి. ప్రపంచానికి చెప్పాలి. మార్కోస్‌కి వీరి గురించి తెలియజేస్తే, ప్రపంచంలో ఎక్కడ వున్నా, పతంజలిగారి కోసం క్షణాలమీద వచ్చేస్తాడేమో! పతంజలిగారు సంస్కృతంలోనూ, మార్కోస్ గ్రీక్‌లోనూ, నేను అచ్చమైన తెలుగు పదాలలోనూ మాట్లాడుకుంటే జన్మ చరితార్థమయి పోదా?

బోలెడు ఆలోచనలు... గుప్పెడు గుండెలో...!

ఆ గదిలో వున్న పాతకాలంనాటి క్యాలెండర్ ఫోటోలు, బట్టలు తగిలించుకొనే కొక్కెం, రాగి అగరవత్తుల స్టాండ్, మా వైపు చూస్తూ పతంజలిగారి తరపున పలకరిస్తున్నట్టుగా వున్నాయ్.

ఎంతసేపు గడిచిందో తెలియలేదు.

''క్షమించాలి... మీరు వచ్చి చాలా సేపు అయినట్టుంది.'' – ఆ గది దగ్గరకి వస్తూ అన్నాడతను. పతంజలిగారి కొడుకుగా తనని తాను పరిచయం చేసుకున్నాడు. మా గురించి చెప్పాడు దీక్షితులు. అతను ఏదో చెప్ప బోతూండగా పతంజలిగారిలో కదలిక కనిపించింది. అటుగా చూశాను –

మెడ మా వైపు తిప్పి ప్రయాణం చేసి చూపుని మా వైపు తిప్పగలిగాడు. కళ్ళలో తేజస్సు. ఆ తేజస్సులో లిపులు... భాషలు... భావనలు....

మాట్లాడే ప్రయత్నం చేసాను... జవాబులేదు...

''సరస్వతి లిపి'' అన్నాను... గట్టిగా....

వాళ్ళబ్బాయ్ ఆ మాటే అన్నాడు... ఆయన చెవి దగ్గర తలపెట్టి....

ఆయనలో చెప్పాలనే ప్రయత్నం కనిపించింది. చెప్పలేకపోయినాననే నిస్సహాయత కనిపిస్తోంది.

కాసేపు నిశ్శబ్దం.

''గత కొద్ది కాలంగా యిదేనండి నాన్నగారి పరిస్థితి.... మాట్లాడలేకపోతున్నారు. కదలలేక పోతున్నారు. యిద్దరు మనుషుల సాయం లేకపోతే పంచె కూడా మార్చలేకపోతున్నాము.'' – తండ్రివైపు చూస్తూ భారంగా అన్నాడతను. పతంజలిలాంటి పండితులు ఇన్ని సాధనాలు వుండి 'రికార్డు' చేయలేని పరిస్థితిలో వుండడం నిజంగా దురదృష్టకరం.

కళ్ళముందు మహాకావ్యం శిథిలమైపోతోంది, ఏం చేయలేని స్థితిలో తోసేస్తూ.

దీక్షితులు వాళ్ళబ్బాయితో మాట్లాడు తున్నాడు.

దీపాలు వెలిగాయి.

కేవలం రెండు మూడు సార్లు కనురెప్పలు తెరిచి మూసారు అంతే!

'మనుష్యులు, లిపులు ఆదరణ కోరు కుంటాయ్...' మార్కోస్ మాటలు గుర్తు కొచ్చాయి.

''యిక అసాధ్యమా సరస్వతి లిపి తెలుసున్న వాళ్ళని కలవడమే?'' బేలగా అడిగాను పతంజలి గారబ్బాయిని. ఆ అబ్బాయి ఏం మాట్లాడలేదు.

ఏం చేయలేని స్థితిలో బైటకి అడుగు పెట్టాము. పతంజలి గారి పాదాలకి దండం పెట్టుకుని వీధిలోకి వచ్చాము. అమ్మవారి గుడి ముందు నుండి పెద్ద చెరువు వైపు నడుస్తున్నాము.

''మేష్టారు ఆగండి...'' అన్న పిలుపు వినిపించింది. వెనక్కి తిరిగి చూస్తే పతంజలిగారి అబ్బాయి.

''నాకు పెద్దగా చదువు వంట బట్టలేదు. ఏదో ఈ వూరిలోనే టీచర్‌గా పనిచేస్తున్నాను. యింట్లోనే వున్నా నాన్నగారిని అంతగా పట్టించుకోలేదు. మీరు ఎంతో దూరం నుండి వచ్చారు. నాన్నగారికి సంబంధించిన పుస్తకాలు మీకు యిస్తాను. వాటిని సంరక్షించే స్తోమతా శక్తీ నాకు లేదు.'' అంటూ ఓ పాతకాలం చేతిసంచీని అందించాడు. ఆ సంచీలో కొన్ని పుస్తకాలు వున్నాయి. ఆ పుస్తకాల్లో పతంజలి గారు స్వదస్తూరిలో అనేక అంశాలు వున్నాయి.

''... అప్పుడప్పుడు ఆయన చూసే చూపులు ఆ పుస్తకాల వైపే అన్పిస్తుంది,'' క్షణం వేదాంతిలా మరుక్షణం నిమిత్తమాత్రుడిలా అన్పించాడతను.

''బహుశా మీలాంటి వాళ్ళు ఎవరో వెతుక్కుంటూ వస్తారని నమ్మకం వుండి వుంటుంది. అందుకే ప్రాణం కన్నా మిన్నగా భద్రపరిచారు'' అని చెరువు వరకూ మాతో వచ్చాడు.

అప్పుడే రాజమండ్రి వెళ్ళే బస్సు వచ్చింది. పతంజలిగారి అబ్బాయికి కృతజ్ఞతలు చెప్పి బస్సు ఎక్కాము. ఆత్రంగా పుస్తకాలు చూస్తున్నాను. ఓ పుస్తకంలో గుండ్రటి అక్షరాలతో 'సరస్వతి లిపి' అని రాసి, 'కరుణాశంకర్ శుక్లా, వారణాసి' అని చిరునామా వుంది.

''రేపే వారణాసి ప్రయాణం,'' అన్నాను దీక్షితులతో. అతను ఏదో చెప్పబోయాడు. ''ఇక మీద, మనుష్యుల్ని, లిపుల్ని, చరిత్రని, సంస్కృతిని, జీవన శోధనని పోగొట్టుకోలేను,'' అన్నాను మార్కోస్ మాటలు గుర్తు తెచ్చుకుంటూ.

★